కథ

# తప్పెవరిది?

సి.ఎస్.చంద్రశేఖర్

సెల్‌ఫోన్ రింగవ్వడం విని, నెంబరు చూసి సెల్ ఆన్ చేశాడు అమర్.

"హలో"

"ఈజ్ ఇట్ అమర్?"

"అవును. మణిగారా?

"ఏమైంది?"

"ఆ అమ్మాయి పది గంటలకు నా గదికి వస్తూంది"

"వెరీగుడ్. ఇంకో పావుగంటలో మా మనిషి మీ గదికి వస్తాడు. అతను ఈ విషయంలో ఎక్స్‌పర్ట్. సిస్టమ్‌ను ఎలా ఆపరేట్ చేయాలో, కెమేరా ఎక్కడ ఉంచాలో అతను చెబుతాడు"

"అలాగే. పేమెంట్ లక్ష రూపాయలే కదా?"

"ఏం. ఎందుకు అనుమానం?"

"ఆ అమ్మాయి గౌరవప్రదమైన కుటుంబానికి చెందినది. పూర్తిగా నా మీద నమ్మకంతో వస్తూంది. విషయం తెలిస్తే నన్ను చీదరించుకుంటుంది. జన్మలో నా మొహం చూడదు. లక్ష రూపాయల కోసం మనసు చంపుకుని ఈ పని చేస్తున్నాను"

"ఇటువంటి పనులు మనసుపెట్టి చేయాలేగానీ మనసులో పెట్టుకోకూడదు. పనయ్యాక మరచిపోవాలి. సరే. నేను ఉంటాను. పని పూర్తికాగానే ఫోన్ చేయండి. ఆల్ ది బెస్ట్"

సెల్ ఆఫ్ చేసి కుర్చీలో కూర్చున్నాడు అమర్. అతనికి మనసులో టెన్షన్‌గా ఉంది. అతని గర్ల్‌ఫ్రెండ్ సమీర మరో గంట సేపట్లో అతని గదికి వస్తూంది. ఎన్నో రోజులుగా అతను కోరుతున్న ఓ కోరికకు ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది వారం క్రితమే. ఆనందంతో తబ్బిబ్బవుతున్న అతనికి మరుసటిరోజే అతని తండ్రి నుంచి ఫోన్ వచ్చింది. అమర్ అక్కకు పెళ్లి కుదిరిందనీ, నెల రోజుల్లో పెళ్లనీ, బట్టలు, నగలు కొనాలని, బ్యాంకులో దాచుకున్న డబ్బులు సరిపోయేలా లేవని చెప్పాడు అతని తండ్రి. రోజంతా ఆలోచించాక అమర్‌కు ఓ ఆలోచన వచ్చింది. అతని స్నేహితుడు వినోద్‌కు, మణికి మధ్య ఓ విషయంలో ఒప్పందం కుదరడం, అనుకోకుండా వినోద్ గర్ల్‌ఫ్రెండ్ ఊరికి వెళ్లిపోవడంతో వారి ఒప్పందం రద్దవ్వడం గుర్తొచ్చింది. వెంటనే అమర్ వినోద్ సహాయంతో మణిని కలిశాడు. తన గర్ల్‌ఫ్రెండ్ తన గదికి వస్తున్న విషయం చెప్పాడు. మణి అతనికి రికార్డింగ్ ఎక్విప్‌మెంట్ ఇచ్చి అందులో వారి శృంగారాన్ని రికార్డ్ చేయమనీ, బాగా రికార్డ్ అయితే లక్ష రూపాయలిస్తాననీ చెప్పాడు. పని పూర్తయ్యే వరకూ తన సెల్‌ఫోన్ దగ్గరుంచుకోమనీ, అవసరమయితే తనకు ఫోన్ చెయ్యమని చెప్పాడు మణి.

మహబూబ్‌నగర్ నుండి తన తల్లిదండ్రులు ఈపాటికి బయల్దేరి ఉంటారు. తండ్రి ఫోన్ చేసి "తను తరచుగా ఆఫీసు పనుల మీద హైదరాబాద్ వచ్చినప్పుడు దిగే అజంతా హోటల్‌లో దిగుతామని, సాయంత్రం కాలేజీ కాగానే హోటల్‌కు వచ్చి కలవమనీ" చెప్పాడు. అంతా అనుకున్నది అనుకున్నట్లు జరిగితే సాయంత్రానికి తన చేతిలో లక్ష రూపాయలుంటుంది. ఆ డబ్బుతో అక్కకు నగలు, ఇంట్లో అందరికీ బట్టలు, ఇంకా పెళ్లికి ఏవేవి కావాలో అన్నీ కొనెయ్యవచ్చు అనుకున్నాడు.

అయితే అతని మనసులో ఎక్కడో ఓ మూల 'తను చేస్తున్న పని మంచిది కాదేమో' అన్న ఆలోచన మొదలైంది. తన అందాలన్నీ సి.డి.లలో రికార్డ్ అయి దేశమంతటా తిరుగుతుందని తెలిస్తే సమీర తట్టుకోలేదు. ఆత్మహత్య చేసుకున్నా ఆశ్చర్యం లేదు. ఆ పాపం తనకే అంటుతుంది. మణితో తను ఈ పని చేయలేనని చెప్పెయ్యాలి అనుకున్నాడు. మళ్లీ అతనికి అక్క పెళ్లి గుర్తొచ్చింది. లక్ష రూపాయల సొమ్ము కళ్ల ముందు మెదిలింది. మణికి ఫోన్ చేసే ప్రయత్నం మానుకున్నాడు.

ఇంతలో కాలింగ్ బెల్ మోగడం విని తలుపు తెరిచాడు. ఎదురుగా ఓ కుర్రాడు నిలబడి ఉన్నాడు. ఇరవై కూడా ఉండదు వయసు. లైట్ బ్లూ కలర్ జీన్స్‌ప్యాంట్, అదే రంగు జీన్స్ షర్ట్ ధరించి ఉన్నాడు. పిల్లిగడ్డం, చిన్న కళ్లు. చూసే వాళ్లకు విసుగు పుట్టించేలా ఉన్నాడు.

"అమర్ మీరేనా?"

అమర్ అవునన్నట్టు తలూపాడు.

అమర్ లోపలికి రమ్మని పిలిచే లోపలే అతను చనువుగా లోపలికి అడుగుపెట్టాడు. నేరుగా మంచం దగ్గరికి వెళ్లి "ఇక్కడేనా?" అని అడిగాడు మంచంవైపు చేయి చూపిస్తూ.

"కాదు. మంచం కింద" అనాలనుకున్నాడు కోపంతో. ఎలాగో నిగ్రహించుకొని "అవును" అన్నాడు.

"కెమేరా ఏది?"

అమర్ అతని చేతికి వెబ్ కెమేరా ఇచ్చాడు. అతను చాలా ఏంగిల్స్‌లో చూసి, చివరకు టేబుల్ మీద కొన్ని పుస్తకాలు పెట్టి వాటిపై కెమేరాను పెట్టాడు.

"ఇక్కడ్నుంచి మంచం బాగా కవర్ అవుతుంది. కిటికీలు తెరిచి ఉంచితే లైటింగ్ బాగా ఉంటుంది."

"మేము చేస్తున్నది దేవుడి పూజ కాదు"

"అఫ్‌కోర్స్. కనీసం ట్యూబ్‌లైట్ అన్నా వేసుకోండి."

"ఆ అమ్మాయి ఒప్పుకుంటే"

"ఒప్పించండి. ఆ మాత్రమైనా కష్టపడకుండా లక్ష రూపాయలు ఎవరిస్తారు మీకు? పైగా రికార్డింగ్ బాగా అయితేనే మీకు డబ్బు అందుతుంది."

"ప్రయత్నిస్తాను"

"వీలైనంత వరకూ మీ మొఖం కెమేరా ఫేస్ చేయకుండా చూసుకోండి. సి.డి. పోలీసులకు దొరికితే మిమ్మల్ని అరెస్టు చేస్తారు. పని ప్రారంభించే ముందు మంచినీటి కోసమో, వక్కపొడి కోసమో, టేబుల్ దగ్గరకి వెళ్లినట్లు నటించి సిస్టమ్ ఆన్ చేయండి. ఆల్ ది బెస్ట్" అంటూ కన్నుకొట్టి వెళ్లిపోయాడు అతను.

అతను వెళ్లిన గంటసేపటి తర్వాత సమీర అతని గదికి వచ్చింది.

★ ★ ★

కంప్యూటర్ ఆన్‌చేసి రికార్డింగ్ ఎలా జరిగిందో చూసిన మణి "మార్వలెస్. చాలా బాగా వచ్చింది. అమ్మాయి కూడా బాగుంది. యు ఆర్ లక్కీ" అన్నాడు అమర్‌తో.

ఆ కాంప్లిమెంట్ అమర్‌కు ఆనందాన్ని కలిగించలేదు. ప్రతి మనిషి తన జీవితంలో అత్యంత మధురంగా జరుపుకునే ఆ మొదటి అనుభవాన్ని తను మోసానికి, స్వార్థానికి వాడుకోవడం వల్ల అతనిలో గిల్టీ ఫీలింగ్ అధికంగా ఉంది.

"ఓకే రాజా. అతనికి డబ్బులిచ్చెయ్" అన్నాడు మణి తనతో వచ్చిన వ్యక్తితో. అతను యాభై రూపాయల కట్టను అమర్‌కిచ్చాడు.

అమర్ ఆ నోట్లను పరిశీలించి "ఇదేమిటి. ఐదు వేలే ఇచ్చారు" అన్నాడు కోపంగా.

"ఇంకెంత కావాలి?" వెటకారంగా అన్నాడు మణి.


"లక్ష రూపాయలిస్తానని అన్నారుగా"

"అన్నాను. ఆమాత్రమైనా చెప్పకపోతే నువ్వు ధైర్యం చేయవని అలా చెప్పాను."

అమర్‌కు ఏడుపొచ్చింది.

"మా అక్క పెళ్లి కోసం ఈ నీచానికి పాల్పడ్డాను. అటు సమీరకు దూరమవుతాను. ఇటు డబ్బులూ దక్కక రెంటికీచెడ్డ వాడినవుతాను ప్లీజ్. ఆ తొంబై ఐదు వేలూ ఇచ్చేయండి. లేకుంటే మా అక్క పెళ్లి ఆగిపోతుంది."

"అన్నా. అక్క పెళ్లి అంటున్నాడు. ఇంకొంచెం వేసి ఇచ్చెయన్నా" అన్నాడు రాజు మణితో.



"సరే. ఇంకో అయిదు వేలివ్వరా" అని రాజుతో చెప్పి "ఇక నక రాలు చేయకు. గంట పనికి పదివేలు ఈ ప్రపంచంలో ఎవడూ ఇవ్వడు నీకు, నేను తప్ప. పద రాజూ" అంటూ బయటకు నడిచాడు మణి.

బాధగా వాళ్లు వెళ్లిన వైపే చూస్తుండిపోయాడు అమర్.

* * *

"ఏరా.. ఇంత ఆలస్యమయిందేం?" రమణమూర్తి కొడుకును అడిగాడు.

"క్లాసు లేటుగా వదిలారు నాన్నా."

"ఎలా ఉంది నీ చదువు?"

"బాగుంది నాన్నా. బాగా చదువుకుంటున్నాను" అని చెప్పి, సీతవైపు తిరిగి "కంగ్రాట్స్ అక్కా" అన్నాడు ఆమె చేయి అందు కుంటూ.

సీత సిగ్గుపడుతూనే "థ్యాంక్స్" చెప్పింది.

"ఒరేయ్ అమరా. నీవేదో డబ్బులు తెస్తావని అన్నావు. తెచ్చావా?" అని అడిగింది అతని తల్లి.

"నేను అనుకున్నంత రాలేదమ్మా. పది వేలే వచ్చింది" జేబులోంచి డబ్బు తీసి తండ్రి చేతికి ఇస్తూ అన్నాడు.

"ఎక్కడిది ఇంత డబ్బు నీకు?" అనుమానంగా అడిగాడు రమణమూర్తి.

"ఇంటర్‌లో నా మార్కులకు స్కాలర్‌షిప్ కాలేజీవాళ్లు ఇచ్చారు" ముందే సిద్ధం చేసుకున్న సమాధానం చెప్పాడు.

గర్వంగా భార్యవైపు చూశాడు రమణమూర్తి. ఆమె మొహం కూడా వెలిగిపోతూంది.

"కంగ్రాట్స్‌రా అమరా" అంటూ తమ్ముడిని అభినందించింది సీత.

తర్వాత అందరూ లేచి షాపింగ్‌కు బయలుదేరారు.

* * *

కాలింగ్ బెల్ శబ్దం విని తలుపు తెరచిన సమీరకు ఎదురుగా అమర్ కనబడ్డాడు.

"ఏమిటి అర్జెంటుగా రమ్మన్నావు? పోయిన వారం చేసిన పనిని రెన్యువల్ చేసుకోవడానికా?" నవ్వుతూ అడిగాడు అమర్.

"షటప్. ఆ రోజు ఏం జరిగింది?"

"ఏ రోజు?"

"నేను నీ గదికి వచ్చినరోజు"

"నీకు తెలియదా? నాకు చెప్పాలంటే సిగ్గేస్తుంది."

"నీకా...సిగ్గా...? సిగ్గులేని..నీతిలేని..మనసులేని...రాక్ష సుడివి నువ్వు."

"ఏమిటి నువ్వంటున్నది?" భయంభయంగా ఆమెను చూస్తూ అడిగాడు.

"నటించకు. నాకు ఒళ్లు మండిపోతూంది. ఇదే మిటి?" అంటూ కంప్యూటర్ ముందుకెళ్లి మౌస్ రెండు చోట్ల క్లిక్ చేసింది. వెంటనే కంప్యూటర్ స్క్రీన్‌పైన శృంగార దృశ్యాలు కనబడసాగాయి. అమర్ తీసుకున్న జాగ్రత్తల వల్ల అతని మొహం కనబడటం లేదు. సమీర మాత్రం స్పష్టంగా కనిపిస్తూంది.

"నిజం చెప్పు. ఆ రోజు మన శృంగారాన్ని వీడియో తీశావు కదూ"

అవునన్నట్టు తలూపాడు.

వెంటనే అతని చెంప చెళ్లుమంది. సమీర కోపంగా అతని చెంపలు వాయించసాగింది. క్షణాల్లో అతని చెంపలు ఎర్రగా కందిపోయాయి. అతను ఆమెను వారించనూ లేదు. దూరంగా జరగనూ లేదు. "నీవే శిక్ష విధించినా నేను అందుకు అర్హుణ్ణే" అన్నట్లు కళ్లు మూసుకుని ఆమె ఎదురుగా నిలబడ్డాడు. తర్వాత తను ఆ పని ఎందుకు చేయవలసి వచ్చిందో సమీరకు చెప్పాడు.

"ఎంత మోసం చేశావు అమర్. నేనెలా తలెత్తుకు తిరుగను? నా బ్రతుకే నాశనం చేశావు కదా. మా అమ్మా నాన్నలు ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేసినం దుకు నాకు తగిన శాస్తే జరిగింది" అంటూ తలపట్టు కుని ఏడవసాగింది.

అమర్‌కు ఏం చేయాలో తోచలేదు. ఆమెను ఎలా సముదాయించాలో కూడా తెలియలేదు. సోఫాలో కూర్చుని ఆలోచనా రహితంగా కంప్యూటర్ స్క్రీన్ వైపే చూడసాగాడు.

సీన్ పూర్తయినట్లు రెండు సెకండ్లు ఖాళీ స్క్రీన్ కనిపించింది. వెంటనే మరో సీన్ మొద లయింది. వయసులో ఉన్న ఓ అమ్మాయి బాత్‌రూంలో స్నానం చేస్తూంది. అంత టెన్షన్ లోనూ కళ్లు తెరచుకొని ఆ దృశ్యాన్ని చూడసా గాడు.

ఆ అమ్మాయి తనను కెమేరాతో చిత్రీకరిస్తున్నా రన్న బిడియమే లేకుండా తాపీగా స్నానం చేస్తూంది. స్నానం పూర్తయ్యాక టవల్ తీసుకోవడానికి తలెత్తి చూసింది. ఆమె మొహాన్ని చూసి షాక్ తిన్నాడు అమర్. "అక్కా" అంటూ బిగ్గరగా అరిచాడు. ఆ అరు పునకు సమీర భయపడి లేచి నిలబడింది.

"సమీరా. మా అక్కను...మా అక్కను కూడా షూట్ చేశారు" అంటూ చేతులతో మొహాన్ని కప్పుకుని ఏడవ సాగాడు.

సమీరకు అతన్ని చూస్తే జాలి కలుగలేదు. ఏవగింపు కలిగింది.

తరువాత అమర్ లేచి కళ్లు తుడుచుకుని బయటకు నడిచాడు. ఆమెకు ఆ క్షణంలో అతను తన నుంచి తప్పించుకోవడానికి నాటకం ఆడుతున్నాడేమో అని అనుమానం వచ్చింది.

సాయంత్రం వరకూ ఇంట్లోనే గడిపింది అతని గురించే ఆలోచిస్తూ. సాయంత్రం అయిదు గంటలకు తల్లి ఆఫీసు నుంచి రాగానే తను బయలుదేరి అమర్ గది చేరుకుంది. గది బయటే అతని రూమ్‌మేట్, తన క్లాస్‌మేట్ అయిన పవన్ కనిపించాడు. సమీరను చూసి "రండి" అంటూ లోపలికి ఆహ్వానించాడు.

"అమర్ లేడా?"

"లేడు. వాళ్ల ఊరెళ్లాడు. అతని అక్కయ్య చనిపో యిందని కబురొచ్చింది. వెంటనే బయలుదేరి వెళ్లాడు. నేను అతన్ని బస్సెక్కించి ఇప్పుడే వచ్చాను."

"అయ్యో పాపం. ఎలా చనిపోయింది?" బాధగా అడి గింది.

"అమర్ కుటుంబం ఈమధ్య హైదరాబాద్‌కు వచ్చి ఓ హోటల్లో దిగారు. ఆ హోటల్ గది బాత్‌రూమ్‌లో ఎవరో రహస్యంగా వెబ్ కెమేరాను అమర్చారు. అమర్ అక్కయ్య స్నానం చేసే దృశ్యాన్ని వీడియో తీసి, సి.డి.లలోకి ఎక్కించి అమ్ముకున్నారు. స్నేహితురాళ్ల ద్వారా విషయం తెలుసుకున్న అమర్ అక్కయ్య ఈ రోజు మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకుంది."

"మైగాడ్" అంటూ తల పట్టుకుని కుర్చీలో కూర్చుండిపోయింది. తర్వాత లేచి అమర్ రాగానే తనకు ఫోన్ చేయమని పవన్‌తో చెప్పి బయలుదేరింది. రోడ్డుపై నడుస్తున్న ఆమె మదిలో ఎన్నో ప్రశ్నలు మెదిలాయి.

ఈ తప్పు ఎవరిది? పెరిగిన టెక్నాలజీదా? తల్లి దండ్రులిచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేసు కుంటూ పెళ్లికి ముందే ప్రణయానికి సిద్ధమ వుతున్న తనలాంటి ఆడపిల్లలదా? డబ్బు సంపాదించాలనే ఆశ తప్ప సక్రమంగా సంపా దించాలనే ఆలోచన లేని అమర్ లాంటి యువకు లదా? డబ్బు కోసం అమ్మాయిల అందాల్ని అక్రమంగా చిత్రీకరించి అమ్ముకుంటున్న దుర్మార్గులదా? ఎవరిది తప్పు? తప్పు ఎవరిదయినా బలయింది మాత్రం అన్నెం పున్నెం ఎరుగని ఓ అమాయకురాలు. ఆమె తన జీవితాన్నే ముగించుకుంది. తను అమాయకు రాలు కాకపోయినా ఆమె పరిస్థితిలోనే తానూ ఉంది. తను బ్రతకాలా? చావాలా? తను బ్రతి కుండి అమర్ సహాయంతో ఆ ర్యాకెట్ నడుపు తున్న దుండగుల్ని చట్టానికి పట్టిచ్చి అమా యకులైన ఆడపిల్లల జీవితాలు కాపాడాలని నిశ్చయించుకుంది సమీర.

## ప్రత్యేకావకాశం

***సినిమాలు లేవని ఖాళీగా ఉండే తారలు ఆ ఖాళీ సమయాన్ని కంపెనీల ప్రచారానికి ఉపయోగిస్తే వారికి నాలుగు డబ్బులు వస్తాయి. ఇంతకీ ఈ కథంతా ప్రియాంకా చోప్రా గురించే చెబుతున్నది. ఇప్పుడామె వివిధ కంపెనీలకి యాడ్స్ చేయడానికి సుముఖత వ్యక్తం చేస్తోంది. ఇదిలా ఉంటే ఎక్స్‌పోజింగ్‌కి దూరంగా ఉంటానని చెప్పిన ఈమె నిర్ణయం అభిమానుల్ని నిరాశపర చింది. ఈ నిర్ణయం పునర్ సమీక్షించుకోవా లని వారు కోరుతున్నారు.***

